
# ధనం మూలం

మల్లంపల్లి కృష్ణారావు



ఇంత బలహీనంగా ఉండి యిప్పుడేం తిరుపతి బయల్దేరగలన్రా! కాస్త ఒళ్ళు రక్తం పట్టగానే వెళ్దాంలే! స్వామి అనుగ్రహం ఉంటే నేను కోలుకోడం ఎంతసేపు? వెళ్ళడం ఎంతపని? అన్నాడు విశ్వనాధం కొడుకు శంకరంతో.

తండ్రి యిప్పుడు బయల్దేరడన్న విషయం శంకరం ముందే ఆలోచించాడు కాబట్టి ఏమీ అనలేదు. "డాక్టరు గారు నిన్ను సాధ్యమైనంత విశ్రాంతి తీసుకోమన్నారు," అని మాత్రం చెప్పి వెళ్ళిపోయాడు.

'విశ్రాంతి కాకపోతే నాకు పనే ముందిలే' అనుకున్నాడు విశ్వనాధం. "స్వామి దయగా చూస్తే, యింకో రెండు నెలలలో తిరుపతి బయల్దేరవచ్చు. ఆప

రేషనంటూ జరిగిందికదా? యిక శరీరానికి జబ్బంటూ ఏమీలేదు. కావలిసిందల్లా సత్తువ చేకూరడమే. రోజూ డాక్టరు వచ్చి చూస్తూనే ఉన్నాడాయె. ఏం ఫర్వాలేదు. రెండునెలల్లో తిరుపతి వెళ్ళగల్ను."

సింహాచలం బత్తాయిరసం ఇచ్చాడు. "భాస్కరం వచ్చాడ్రా?" అన్నాడు విశ్వనాథం రసం తాగుతూ.

"వచ్చారయ్యా; ఇప్పుడే వచ్చారు." అన్నాడు సింహాచలం.

"అయితే వాడిక్కూడా యింకో గ్లాసుడు రసం పట్రా."

భాస్కరం వస్తూనే అడిగాడు "ఏం తాతయ్యా! వంట్లో ఎలా ఉంది."

"అప్పుడే ఎలా బావుంటుందిరా! నువ్వు డాక్టరు పాసవ్వాలి, నాకు నయమవ్వాలి." అన్నాడు విశ్వనాధం నవ్వుతూ. "అది సరేగాని యివేం పుస్తకాల్రా? ఓ దైవభక్తి లేదు, ఓ వేదాంతం లేదు, కనీసం ఓ కథా లేదు. తిరుగుబాటూ, విప్లవం అంటూ గేయాలూ, గంతులూ తప్పిస్తే."

"నే నేం చెయ్యను. నీకు నచ్చని పుస్తకా లంటే 'తోచక్లేదు, ఏవో పుస్తకాలు పడెయ్యి' అన్నావు. అందులో రాశాడుగా: 'ఎముకలు కుళ్ళిన, వయసు మళ్ళిన సోమరు లీ పుస్తకాన్ని చదవకూడ'దని. 'అల్ ఈజ్ వెల్ అండ్ సైజ్‌లీ పుట్' అంటూ పట్టు దిళ్ళలో పడుకోమని." భాస్కరానికి ఏ మాట మాట్లాడినా చెల్లుతుంది. విశ్వనాథానికి శంకరం ఒక్కడే కొడుకయితే, భాస్కరం శంకరానికి ఒక్కగానొక్క కొడుకు.

విశ్వనాథం ఇంకా నవ్వుతూ "అరవై ఏళ్ళు దాటిన నాలాంటివా ళ్ళందర్నీ బతకనీరన్నమాట మీ రాజ్యం వస్తే.'' అన్నాడు.

"ఏళ్ళు రావడంకాదు ముఖ్యం. డెబ్భైఎనభైఏళ్ళుండి చైనానాయకు డెవరో గానీ ఓ నదిని ఈదేశాట్ట. మా లెక్చరర్‌కి యింకా నలభై ఏళ్ళు లేవు. సిటీ బస్సులో నుంచోలేక సీటుకోసం మమ్మల్ని బతిమాల్తాడు. కొందరికి ముందే ముసలితనం వస్తుంది. ఈ పుస్తకం నచ్చనివా ళ్ళందరూ అంతే." అన్నాడు భాస్కరం 'మహాప్రస్థానం' చూపిస్తూ.

"యిలా మాస్టర్లీ వేళాకోళం చేస్తున్నావు కాబట్టే పరీక్ష లిలా ఫేలవుతున్నావు." అన్నాడు విశ్వనాథం.

"మార్కుల్నిబట్టి వచ్చిం దేమిటి? డబ్బిచ్చి కొనుక్కున్న సీటు. నమ్మకపాసవమంటే ఎలా? ఈసారి పాసవుతానేమోలే! నాన్న ఎగ్జామినర్స్‌నికూడా డబ్బెట్టి కొన్నాడు. ఈరోజుల్లో డబ్బుకి రాని దేం లేదు తాతయ్యా. డబ్బెట్టి నేను సీటు కొనుక్కున్నాను. డబ్బెట్టి వరహాలు మామయ్య ఓట్లు కొని మున్సిపల్

ఛైర్మెన్ అయ్యాడు. డబ్బు లంచం యిచ్చి నాన్న యింజనీర్లని (అంటే గవర్నమెంటుకూడాలే) కొనేసి కంట్రాక్టులు సంపాదించాడు. డబ్బుపెట్టి అక్కయ్యకి కట్నంతో ఫారిన్ రిటర్న్డ్‌ని కొనేశాడు."


విశ్వనాథం ఏం మాట్లాడలేదు. అతనికి నవ్వొచ్చింది. ఈ భాస్కరం పుట్టకమునుపు త ననుభవించిన దరిద్రాన్ని తల్చుకుంటే ఒళ్ళు విడిపోతుంది. తను ఓనాడు తట్టలు మోసి శంకరాన్ని పోషించాననీ, అందరం పందులగూడెంలో పూరిపాకలో ఉండేవాళ్ళమనీ, అప్పుడు మనవడికి డాక్టరు కోర్సు చెప్పించడం పగటికల అనీ వీడికి తెలీదు. యిప్పుడు తెలియాల్సిన అవసరంలేదు. శంకరం ప్రయోజకుడై తను మొదలుపెట్టిన కంట్రాక్టుపనులు పదింతలు చేశాడు. దాలి కలవాటు పడిన ఎద్దుల్ని బండికి కట్టి, బండిమీద నిద్రపోయినట్టు ఎవళ్ళకీ ఏ శ్రమా లేకుండా వ్యాపారం సాగిపోతూంది; లాభాలు వస్తూనేఉన్నాయి. భాస్కరానికి అదృష్టంకొద్దీ ఈ స్థితి వాడు పుట్టినప్పట్నుంచీ ఉన్నదే. తనకిమాత్రం మంత్రగాడు మాయచేసి చెట్టుని తెప్పించినట్టుంది. దేనికైనా దైవానుగ్రహం ఉండాలి. ఈ భాస్కరం యిప్పు డేవో కుర్రతనంకొద్దీ నాలుగు కమ్యూనిస్టు ముక్కల్ని నేర్చుకుంటే సరా!

"నవ్వుతా వెందుకు తాతయ్యా! నీ ఆరోగ్యంకూడా డబ్బెట్టి కొన్నదే. నీ కొచ్చిన కంప్లెయింట్‌కి ఇంకా బతికి ఉండటం ఆశ్చర్యం అన్నమాట! ఏంతయిందేమిటి?" అన్నాడు భాస్కరం.

"డాక్టర్ ఫీజులకి, మందులకి, హాస్పిటల్‌కీ యివన్నీ కలిపి ఎనిమిదివేలవదూ మరి?" అన్నాడు విశ్వనాథం నవ్వుతూ.

"ఇంకో విషయం ఉంది. ఆపరేషన్ ముందు నీకు నాలుగు బాటిల్స్ రక్తం ఎక్కించారు. ఆ రక్తం ఎలా వచ్చిందో తెలుసా? నే నివ్వలేదు. రెండునెల్లకిందట ఉక్కుఫాక్టరీ ఉద్యమంలో గాయపడినవాళ్ళకి రక్తం ఇచ్చాను కాబట్టి న న్నివ్వద్దన్నారు. నాన్న యిస్తానన్నాడు కానీ డాక్టర్ ఒక్కమనిషి యిచ్చేది సరిపోదన్నాడు. అప్పుడు వార్డుబాయ్ నల్గుర్ని పట్టుకొచ్చాడు. వాళ్లు దొంగల్లాగో, అడుక్కుతినేవాళ్ళలాగో ఉన్నారు. మొత్తానికి అలగాజనంవాళ్ళే. ఒక్కొక్కడికీ పాతిక రూపాయి లిచ్చి వాళ్ళ రక్తం కొన్నారు. ఆ రక్తాన్ని బ్లడ్‌బాంక్‌కి యిచ్చి నీ క్కావలసిన రక్తం తెచ్చుకున్నారు. అదీ సంగతి," అన్నాడు భాస్కరం ఊపిరి పీలుస్తూ.

"ఏమిటేమిటీ, ఎలాగ?" అన్నాడు విశ్వనాథం ఆశ్చర్యంగా.




"అవును – కావలిస్తే నాన్న నడుగు. నీకు రక్తం యిచ్చినందుకు ఆ బేవార్సు గాళ్ళు నలుగురికీ యిచ్చింది వంద రూపాయిలు. నువ్వు చెప్పిన ఏడు వేల రూపాయిల్లోనూ ఈ వంద ఉందో లేదో కానీ, ఆ ఏడువేలూ ఉన్నా ఈ వంద లేకపోతే 'మే యువర్ సోల్ రెస్ట్ యిన్ పీస్.' పైగా ఆ రక్తం యిచ్చే వాళ్ళు ప్రొఫెషనల్స్ – అంటే అలా రక్తం యిచ్చి డబ్బు తీసుకుని బతుకుతున్నారన్న మాట. మీ రందరూ వాళ్ళ రక్తం తీసుకుని బతుకుతున్నారు. వాళ్ళు రక్తం యిచ్చి చస్తున్నారు." భాస్కరం తేలిగ్గానే మాట్లాడినా ఉద్రేకం వచ్చింది.

"అయితే ఆ నాల్గురూ చచ్చి పోయారా?" విశ్వనాథం అడిగాడు.

"ఏమో తెలీదు. ఇప్పుడు కాకపోతే రేపు. మళ్ళీ వాళ్ళింట్లో బియ్యం ఉండవు. మళ్ళీ వాళ్ళ పెళ్ళాలికి రోగాలు ముదురు తాయి. మళ్ళీ వాళ్ళ పిల్లలు తిండిలేక ఏడుస్తూంటారు. మళ్ళీ నీలాంటివాళ్ళకి రక్తం కావాల్సొస్తుంది. వాళ్ళు మళ్ళీ రక్తం యిచ్చి డబ్బు తీసుకుంటారు. ఇలా ఎంత సేపూ – చావాలసిన దాని కంటె చాలా ముందే చస్తారు."

"అవునుమరి," అన్నాడు విశ్వనాథం ఆలోచిస్తూ. ఆపరేషన్ ముందు తను తిరుపతి దర్శనం చేసుకుంటాననీ, హుండీలో వెయ్యిరూపాయిలు ముడుపు చెల్లిస్తాననీ మొక్కుకున్నమాట జ్ఞాపకం వచ్చింది. ఆ వెయ్యిరూపాయలూ తలగడక్రిందే పసుపుగుడ్డలో పొట్లం కట్టిఉన్నాయి. తనని ఈ వెయ్యిరూపాయిలు రక్షించాయా? లేకపోతే రక్తాని కిచ్చిన ఆవందరూపాయిలు రక్షించాయా?

"అది సరేగాని తాతయ్యా! తిరుపతి ప్రయాణం ఏమిటి? పొద్దున్న అమ్మ చెప్పింది."

"అవున్రా; నువ్వు పాసవుతే తిరుపతి వెళ్తామని మొక్కుకున్నాంగా!" అన్నాడు విశ్వనాథం. తన ఆరోగ్యాని కూడా మొక్కుకున్నానని చెప్పడానికి ధైర్యం చాల్లేదు. డబ్బెట్టి దేముణ్ణికూడా కొనచ్చు.

"తిరుపతి, గిరపతి జాన్తానై. వెళ్ళితే మీ రెళ్ళండి. నే చచ్చినా రాను," అంటూ వెళ్ళిపోయాడు భాస్కరం.

* * *

భాస్కరం ఉద్రేకంలో అన్నమాట విశ్వనాథానికి గట్టిగా పట్టుకుంది. 'అవును! ఆ నల్గురూ చస్తారు. ఇప్పటికీ చావిపక పోతే రేపు; నల్గురి ప్రాణాల్ని వందరూపాయిలకు కొని తనకి మంగళం పుతే యింకో అయిదేళ్ళ జీవితాన్ని సాగదీశారు. ఆ నల్గురూ చస్తే వాళ్ళపిల్లలూ, పెళ్ళాలూ అందరి ఉసురూ తగల్దూ మరి. అయినా ఆ వెధవలు రక్తాన్ని అమ్మట మేమిటి? దౌర్భాగ్యులు." విశ్వనాథానికి చిరాకని పించింది. "ఒరేయి సింహాచలం! ఇలా వచ్చి కాస్త కాళ్ళుపట్టు," అనికేకేశాడు.


మరో ప్రసంగం లేకపోతే రక్తం యిచ్చిన ఆ నల్గురి గురించి ఆలోచన మెదణ్ని తినేశాలా ఉంది విశ్వనాథానికి. "అయితే సింహాచలం, మొన్న శెలవు పెట్టిన రెండురోజులు ఎక్కడికి కెళ్ళావురా?" అని అడిగాడు.

చిట్టివలస బాబూ! మా మేనకోడలు సచ్చిపోనాది; సూట్టాని కెళ్ళాను," అన్నాడు సింహాచలం.

"మీ మేనకోడ లంటే ఎవరు? పోలమ్మ కూతురు చిట్టేనా? దాని కేమొచ్చిందిరా! నిండా ముప్పైఏళ్ళు లేవు దానికి. నిక్షేపంలా ఉండేది."

"అవునుబాబూ, చిట్టే! మొగుడు తగిలేసినాడు. చిట్టివలసలో మిల్లులో కూలీపని చేసేది. పుట్టకురుపు లేసింది బాబూ, గొంతుమీద. చిట్టివలసలో డాట్టరుకి సూపిస్తే 'యిశాఖపట్నంపెద్దాసుపత్రికి తీసికెల్లండి, యిక్కడ నాథం నేమ' అనేసినాడు. యిశాఖపట్నం తీసికెల్తే 'రెండునెల్లుండాల, ఆపరేషన్ సేయించుకోవాల, అక్కడ పేసెంటు కొకరు తోడుండాల, యీ టన్నిటికీ ఎనిమిదొందల రూపాయిలు అవుతా' అన్నాడు ఆ డాట్టరుబాబు. 'అంత ఖరాయించుకోలేను. మీరే వైద్దం చేసెయ్యండి' అంది పోలమ్మత్త. 'వైద్దం సేస్తానుగానీ మూడునెలల్లో మాత్రం సచ్చిపోద్ది' అని అప్పుడే డాట్టరుబాబు సెప్పేసినాడు. అలాగే సచ్చిపోనాది, యిశాఖపట్నం తీసికెల్తే బతుకును బాబూ. పోలమ్మత్త ఎనిమిదొందలు ఎక్కణ్ణించి తీసుకొత్తాది – తినడానికేలేకపోతేను!"

విశ్వనాథానికి షాక్ కొట్టినట్టయింది. ఎనిమిదొందలు లేకపోయినందువల్ల




నిండా ముప్పైఏళ్ళు లేని చిట్టి చచ్చిపోయింది. అరవై దాటినతను ఏడువేలూ ఖర్చుపెట్టి యింకో అయిదేళ్ళ జీవితాన్ని పొడిగించుకున్నాడు చిట్టి ఫాక్టరీలో పనిచేసి సంపాదించి పోలమ్మనీ పిల్లల్నీ పోషించేది. తనకి భాస్కరం పెళ్ళి చూద్దామనే కోర్కె తప్ప యింకా బతికి సాధించే దేం లేదు తనకి డబ్బుంది బ్రతుకును కొనుక్కున్నాడు చిట్టి కది లేదు చచ్చిపోయింది

శంకరం వచ్చాడు "తిరుపతి వంద రూపాయలు మనియార్డరు చేసినందుకు ప్రసాదం పంపారు, యిదిగో." అని ప్రసాదం యివ్వబోయాడు.

విశ్వనాధం చిరాగ్గా "సరేలే; ఆ టేబిల్ మీద పెట్టు భాస్కరాన్ని ఓ సారి పంపించు." అన్నాడు

శంకరం ఆశ్చర్యంగా చూసి వెళ్ళిపోయాడు భాస్కరం రాగానే విశ్వనాధం తలగడ కింద తిరుపతిదేవుడికి మొక్కుకున్న వెయ్యిరూపాయిల పొట్లం తీసి "ఒరే భాస్కరం! నీకుమల్లే నాస్తికుడ్నయ్యేటంత ధైర్యం నాకులేదు కానీ, ఈ వెయ్యిరూపాయిలూ తీసుకుని ఆ రక్తం యిచ్చిన నల్గురూ చావకుండా బతికిఉంటే వాళ్ళ కియ్యి లేకపోతే యింకెవళ్ళైనా రక్తం అమ్మేవాళ్ళుంటే వాళ్ళకైనా యిచ్చెయి. ఆ ప్రసాదం ఖరీదు పందరూపాయలు - నేను తినను తీసుకుపో; డబ్బెట్టి అర్హతలేని జీవితాన్ని కొనుక్కుందా మనుకోటంలేదు నేను." అన్నాడు హిస్టారిక్‌గా.